# సాహిత్యా వీధిలో ఊహాల గోష్ఠి

వి.ఎస్.వి. రత్నం

శ్రీకృష్ణ దేవరాయ సార్వభౌముల వారి కవితా స్వాదనా, పోషణా కూడా జగద్విదితమే. కాలం తీరి స్వర్గస్తులైనా, తీరిక సమయాల్లో వారు ఆ స్వర్గ లోకంలో కూడా కవి వరేణ్యులతో కలసి కాలక్షేపం చేసే కళా హృదయు లని అక్కడికి వెళ్ళిన వా రందరికీ అనుభవమే. భూలోకంలో ఉండగా వారి ఆస్థానంలో ఉన్న అష్టదిగ్గజాలతోనే కాకుండా, అటు పిదవ స్వర్గం చేరుకున్న ఆ తరువాతి తరాలకు చెందిన తెలుగు పండితులతో కూడా వారు అప్పు డప్పుడూ గోష్ఠి చేసి, వారి పాండిత్యాన్ని గ్రోలి ఆనందిస్తూనే ఉన్నారు.

ఒకప్పుడు భూమి మీద ఎంతటి సార్వభౌముడైనా, పాపం, ఇప్పుడు మాత్రం రాయలవారు స్వర్గలోకాధిపతి అయిన మహేంద్రుడికి సుమారుగా ఓ సామంతుడితో మాత్రమే సమానం. అందుకే ఇంద్రుడు అక్కడ వారికి అప్పగించిన రకరకాల రాచకార్య భారాలతోనూ, అంతూ అలుపీ లేని స్త్రీ సాంగత్యాలతోనూ గత రెండు మూడు దశాబ్దాలుగా అక్కడ వారి కళాస్వాదనకు కొంత అంతరాయం కలిగిన మాట వాస్తవమే. కానీ, అనుకోకుండా ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు మళ్ళీ వారికి ఇందుకు తీరుబడి చిక్కిం దనే వార్త సహృదయు లందరికీ ఎంతో సంతోషం కలిగించే సంగతి.

చక్రవర్తి తలచుకుంటే జరగని దేముంటుంది? వారికి ఇప్పటికీ ఎంతో ఆప్తుడూ, ఆత్మీయుడూ, అత్యంత అంతరంగికుడూ, మహా మంత్రీ అయిన తిమ్మరుసును [భూలోకంలో బ్రతికి ఉండగా చివరి రోజుల్లో ఇద్దరి మధ్యా ఏర్పడిన అపార్థాలు స్వర్గలోకపు తొలినాళ్ళలోనే తొలగిపోయాయి.] పిలిపించి, తన అంతర్యాన్ని వెల్లడించారు రాయలవారు. వారి అభీష్టం ప్రకారమే వారి ముచ్చట తీర్చడానికి ఆ క్షణమే నడుం కట్టాడు అప్పాజీ.

ఆ వెనువెంటనే అక్కడి [స్వర్గలోకపు] ఆకాశవాణి, దూరదర్శన్, దిన. వార., పక్ష, మాస పత్రికల్లో ఒక ప్రకటన వెలువడింది.

**రాయలకాలంలో కవితా గోష్ఠులు 'భువన విజయం'లో అత్యంతాహ్లాదకరంగా జరిగేవట. స్వర్గలోకం చేరిన కవు లందరూ అటువంటి గోష్ఠినే ఏర్పాటు చేసి, పోటీ పెడితే బహుమతి ఎవరికి లభిస్తుంది?**

ఆ ప్రకటన సారాంశం క్లుప్తంగా ఇదీ:

"శ్రీకృష్ణ దేవరాయల వారు క్షణం తీరికలేని రాచకార్యాల్లో మునిగి తేలుతూ కూడా కవితాస్వాదనని విస్మరించలేని రస హృదయు లనీ, వారి పోషణలో కళ కాంతితో కళకళలాడుతుందనీ మీ కందరికీ తెలును. మళ్ళీ ఇన్నాళ్ళకు వ్యవధి దొరికిన కారణంగా శ్రీ రాయలవారు ఉత్తమ పండిత సత్కారం చేయదలిచారనీ, ఇందుకుగాను ఫలానా తేదీన, ఫలానా సమయానికి, ఫలానా ప్రదేశంలో స్వర్గ తెలుగు మహాసభ ఏర్పాటు చేస్తున్నామని మీ కందరికీ తెలియచేయడానికి ఎంతో సంతోషిస్తున్నాం. శ్రీ రాయలవారి కళా హృదయం ఎంత గొప్ప దంటే, సార్వభౌములై ఉండీ కొన్ని శతాబ్దాల క్రితం భూమి మీద ఉన్నప్పుడు వారు అల్లసాని పెద్దన కవి గారికి స్వయంగా సువర్ణ గండపెండేరం తొడిగి సత్కరించారు. ఇది మీ కందరికీ గుర్తుండి ఉంటుం దని విశ్వసిస్తున్నాం. ఇక వచ్చే స్వర్గ తెలుగు మహాసభలో జరగనున్న కవితా పోటీలో ఉత్తమ కవిత్వం లేదా రచన చేసి శ్రీ రాయలవారికి మనోల్లాసం కలిగించగలిగే పండితుడికి శ్రీ రాయలవారు తిరిగి స్వయంగా సువర్ణ గండపెండేరం తొడిగి సన్మానిస్తారు.

"ఒకప్పుడు కవిత్వ మంటే కేవలం ఛందోబద్ధమైన పద్యాలే అనీ, కానీ ఇప్పు డది వచనా రచనంలోకి అంటే వచన కవితగా, కథగా, నవలగా, నాటికగా, వ్యాసంగా రూపాంతరం చెందింది కాబట్టి ఇవన్నీ కూడా కవిత్వంగానే పరిగణిత మవుతాయని ఒక ముఖ్య గమనిక.

"రెండవది - వచ్చే స్వర్గ తెలుగు మహాసభలో జరగనున్న పాండిత్య ప్రదర్శనా పోటీ కేవలం నూతన తెలుగు రచయితలకు - అంటే - గత రెండు మూడు దశాబ్దాల కవి పండితులకు మాత్రమే పరిమితం. ప్రబంధ కాలపు, లేదా క్రితం సారి జరిగిన స్వర్గ తెలుగు మహాసభలో పాల్గొన్న పాత తరాల కవులూ, రచయితలూ ఈ పోటీలో పాల్గొనరాదు.

"మూడవది - జరగబోయే సత్కారానికి గల అర్హతకు కొలమానం కేవలం శ్రీ రాయలవారి మనసే అనీ, కేవలం వారికి నచ్చిన రచనకు మాత్రమే సత్కారం లభిస్తుం దనీ కవులూ, రచయితలూ గుర్తుపెట్టుకు తీరాలి. ఇందులో ఎలాంటి వాదోపవాదాలకూ, ఉత్తర ప్రత్యుత్తరాలకూ తావు లేదు.

"నాలుగవది - రెండో బహుమతి, ప్రోత్సాహక సన్మానాలూ వగైరాలు లేవు.




అయిదు - మీ రచనలు మాకు ఫలానా చివరి తేదీలోగా అంది తీరాలి. నిర్ణీత గడువు దాటిపోయిన తరువాత మాకు అందిన రచనలు పోటీకి పరిశీలనకు అర్హం కావు.

"మన స్వర్గ లోకంలో జరగబోతున్న ఈ ప్రప్రథమ సువర్ణ గండపెండేర సత్కార పోటీలో ఉత్సాహంగా పాల్గొని శ్రీ రాయలవారికి ఉత్తేజం కలిగిస్తూ దీనిని జయప్రదం చేయవలసిందిగా ప్రతి ఒక్క తెలుగువారినీ కోరుతున్నాం. ఈ ఉత్సవ వేడుకలో పాల్గొని, సభని తిలకించి ఆనందించాల్సిందిగా పరభాషా పండితుల్ని విదేశీ విద్వాంసుల్ని కూడా మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తూ వారికి ప్రత్యేక ఆహ్వానాలు కూడా పంపుతున్నాం."

స్వర్గ తెలుగు సాహితీ ప్రపంచంలో ఈ ప్రకటన ఎంతో సంతోషం, సంచలనం కలిగించింది. సువర్ణ గండపెండేర సత్కారం అంటే మాటలా? ఇది స్వర్గ తెలుగు సాహిత్య అకాడెమీని మించిన బహుమతి. పోతే, సినిమా ఛాన్సు ఆశ ఎలాగూ ఉన్నదే! అందువల్ల కవులూ, రచయితలూ ఈ అపూర్వ సన్మానం తమకే దక్కుతుం దని ఎవరికి వారే సంబరపడిపోతూ, తమ పాండితీ ప్రాభవాన్నీ రచనా చమత్కృతినీ ప్రదర్శించడానికి కలం, కాగితాలూ చేతబట్టి దస్తాలకు దస్తాలు నింపడం మొదలుపెట్టారు. ఆ సత్కారం ఎవరిని వరిస్తుందో నని స్వర్గ తెలుగు కాలనీలో కొంతమంది పందాలు కూడా కాసుకున్నారు.


అనుకున్న రోజు రానే వచ్చింది. మహాసభ కోసం సభా ప్రాంగణాన్ని సిలుకు తెరలతోనూ, చమ్కీ దండలతోనూ, వ్యాపారవేత్తల బానర్లు, పెద్ద పెద్ద కటౌట్లతోనూ అలంకరించారు. మైకులూ, క్లోజ్డ్ సర్క్యూట్ టీ.వీ.లు ఏర్పాటు చేశారు. తెలుగు వార లందరూ తరలి వస్తారేమో నని అల్లరి జరక్కుండా బారికేడ్లు కట్టించి, కళ్యాణ మండపాల్నుంచీ, అద్దె షాపుల్నుంచీ ఓ లక్ష వరకూ కుర్చీలు తెప్పించి వరుసగా అమర్చారు.

కొంతమంది మరీ ఉత్సాహవంతులైన కవి పండితులు 'ఈ శతాబ్దపు మాస్టర్ రైటర్', 'ఆంధ్రాస్ సూపర్ రైటర్', 'రైటర్స్ రైటర్' అంటూ తమ గురించి తామే ప్రకటనలు అందరికీ కనిపించేలా చాలా ఎత్తుగా కట్టించుకున్నారు. కొంతమంది స్వర్గ ఆకాశవాణి, దూరదర్శన్, పత్రికలలో కమర్షియల్ ప్రకటన లిచ్చుకుంటే, మరికొందరు చప్పట్లు కొట్టడానికి ప్రత్యేక అభిమానుల్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఇక ప్రత్యేక ఆహ్వానితులైన ముఖ్య అతిథులు సేవించడానికి స్కాచ్, షాంపేన్, వోడ్కా, విస్కీ, బ్రాందీ, భంగు, రమ్, జిన్, వైన్, ఫెన్నీ ఫ్రూట్ జ్యూస్, పామ్ జ్యూస్, కాఫీ, టీ, పాలు, సోడాలు, సిగరెట్లు, కూల్‌డ్రింకులు, కిళ్ళీలు మొదలైన ప్రత్యేక ఏర్పాట్లు ఎన్నెన్నో చేశారు. మొత్తం మీద ఇందుకు కొన్ని లక్షల స్వర్గ సువర్ణ నాణాలూ, నోట్లూ ఖర్చయ్యాయి. అయినా సాక్షాత్తూ రాయలవారే తలచుకున్నప్పుడు ఇక దేనికి కొదవ?

అనుకున్న సమయానికి ఒక్కొక్కరూ, ఇద్ద రిద్దరుగా అందరూ సభకు రావడం ప్రారంభించారు. కుర్చీలు ఒక్కొక్కటిగా నిండటం మొదలెట్టాయి. ఇంతలో అప్పాజీ అక్కడికి వచ్చి, ముఖ్య ఆహ్వానితు లందరినీ పేరు పేరునా పరామర్శిస్తూ, కుశల ప్రశ్నలు వేస్తూ, యోగక్షేమాలు విచారిస్తూ ముందుకు సాగుతున్నాడు.

వాల్మీకి, వ్యాసుడు, హోమర్, మిల్టన్, చిన్నయసూరి, జూల్స్ వెర్న్,




మాక్జింగోర్కీ, షెల్లీ, షేక్స్‌పియర్, ఉమర్‌ఖయాం, బెర్నార్డ్ షా, కీట్స్, బ్రౌనింగ్, అల్లసాని పెద్దన, టాల్‌స్టాయ్, రాబర్ట్ లూయిస్ స్టీవెన్‌సన్, శ్రీరంగం శ్రీనివాసరావు, చింగీజ్ ఐత్‌మాతోవ్, ఓ. హెన్రీ, గుడిపాటి వెంకటచలం, వర్డ్స్ వర్త్, కాళిదాసు, డాస్టో విస్కీ, టెన్నిసన్, శ్రీనాథుడు, రాహుల్ సాంకృత్యాయన్, చార్లెస్ డికెన్స్, రవీంద్రనాథ్ టాగోర్, గాలిబ్, కందుకూరి వీరేశలింగం, సర్ ఆర్థర్ కానన్ డైల్, కె.ఏ. అబ్బాస్, ప్రబోధ్‌కుమార్ సన్యాల్, మున్షీ, తెనాలి రామలింగడు, వర్జీనియా, వుల్ఫ్, విశ్వనాథ సత్యనారాయణ, ప్రేమ్‌చంద్, మునిమాణిక్యం నరసింహారావు, జేమ్స్ జాయిస్, గురజాడ వెంకట అప్పారావు, శరత్‌చంద్ర ఛటర్జీ, తెన్నేటి హేమలత, మొక్కపాటి నరసింహ శాస్త్రి, మనోహర్ మల్గోంకర్, హెచ్.జి. వెల్స్, తిక్కన సోమయాజి, ఇయాన్ ఫ్లెమింగ్, బాల గంగాధర తిలక్, మైథిలీ శరణ్‌గుప్త, బీనాదేవి, చెకోవ్, రాచకొండ విశ్వనాథ శాస్త్రి, ఇర్వింగ్ వాలెస్, జైనేంద్ర కుమార్, అగాథా క్రిస్టీ, సోమర్‌సెట్ మామ్, కొడవటిగంటి కుటుంబరావు, పిలకా గణపతి శాస్త్రి, ఐసిమోవ్, బుచ్చిబాబు, అడవి బాపిరాజు, ఆర్థర్ క్లార్క్, నంది తిమ్మన, ఆర్.కె. నారాయణ్, సుమతీ శతకకారుడు, పాల్ స్కాట్, ఫెడరిక్ ఫ్రోర్స్‌సైత్, వేంకట పార్వతీశ కవులు - ఇలా ఎంద రెందరో అతిరథ మహారథులు అక్కడి కొచ్చి, ముందు వరుసా, వెనుక వరుసా అని పేచీ పెట్టకుండా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. వీరిలోని తెలుగువారంతా పోటీకి అనర్హులే అయినా సభకు హాజ రవడం, గ్రూపు లేవీ కట్టకుండా ఇతర భారతీయ రచయితలతోనూ, విదేశీ విద్వాంసులతోనూ కలిసి మెలిసి కూర్చోవడం అప్పాజీకి చాలా ఆనందా న్నిచ్చిం దనే చెప్పాలి. ఇం కెంద రెందరో మహామహులూ, మహానుభావులూ కూడా వచ్చారు. అందరి పేర్లూ ఇక్కడ రాయడం మాత్రం సాధ్యం కాదు.

ఆ ప్రదేశ మంతా పర్యవేక్షిస్తూ, ప్రముఖుల్ని పరామర్శిస్తూ అప్పాజీ ముందుకు సాగుతుండగా, "రాజాధి రాజ, రాజ మార్తాండ, రణరంగ తేజ" వగైరా వగైరా వందిమాగధుల స్తోత్రాల మధ్య రాయలవారు విచ్చేశారు. వారు తమ సింహాసనాన్ని అధిష్ఠించే వరకూ సభాసదు లందరూ లేచి నిలబడి, కొందరు జయధ్వానాలు చేసి ఆసీను లయ్యారు.

ఇంతలో అప్పాజీ రాయలవారిని సమీపించాడు.

వా రొకసారి సభా ప్రాంగణాన్ని కనులారా తిలకించి, కొంత కలవరపాటుతో అప్పాజీని దగ్గరగా రమ్మని సంజ్ఞ చేసి, ఆయనకు మాత్రమే వినిపించేట్టు నెమ్మదిగా ఇలా అడిగారు - "మీ రీ సభా ఏర్పా ట్లన్నీ నవ్యంగానే ప్రకటించారా అప్పాజీ! సభ ఎందు కింత పల్చగా ఉంది?"

"నా మీద అపనమ్మకమా ప్రభూ? కానీ ..."

"సందేహ మెందుకు? చెప్పండి."

"ఈ రోజు ఇదే సమయానికి మన స్వర్గ జాతీయ టీ.వీ. నెట్‌వర్క్‌లో 'నా శోభనం నేనే చేస్తా' అనే తెలుగు చలనచిత్రం ఒకటి ప్రదర్శిస్తున్నారు ప్రభూ! దానిని తిలకించడానికి మన తెలుగు వా రందరూ ఇళ్ళల్లోనే ఉండిపోయారు. ఎవరో కొందరు ముఖ్యులు తప్ప, వచ్చిన వారంతా పోటీకి రచనలు పంపినవారే సనీ, అసలు సామాన్య ప్రజ లెవరూ ఇక్కడికి రానేలేదనీ నా అనుమానం. ఈ సినిమా ప్రదర్శన విషయం నాకు ముందుగానే తెలుసు. కానీ నే నెంత ప్రయత్నించినా మన స్వర్గ కేంద్ర అధిష్ఠాన వర్గం మాత్రం దాన్ని రద్దు చేయడానికి అంగీకరించలేదు. ఇందులో కొన్ని రాజకీయా లున్నాయి. అవి నేను తరువాత తీరికగా తమకు మనవి చేస్తాను."

"రచనా గోష్ఠికి కూడా రాజకీయాలా? సరే, సరే. అయినా ఆ చలన చిత్రం పేరు అలా ఉం దేమిటి? ఎవరి శోభనమైనా ఎవరికి వారు కాక ... ఛీ! ఛీ!..."

" 'నా మొగుడు నాకే సొంతం', 'నా పెళ్ళాం నా ఇష్టం' ... ఇలాంటి సినిమాలు ఎన్నో వచ్చాయి ప్రభూ! గత రెండు మూడు దశాబ్దాలుగా తమకి తీరిక లేని కారణంగా వర్తమాన కళల పోకడల గురించి తమకు కాస్త స్వల్ప పరిచయం ఉండటంతో అసహజం లేదు."

రాయలవారు ఒక క్షణం దీర్ఘంగా నిట్టూర్చి, సభా కార్యక్రమం మొదలుపెట్టడానికి అనుమతించారు. అప్పటికే వారిలో ఉత్సాహం సగం నశించింది.

అప్పాజీ సభాసదుల వైపు తిరిగి, ముకుళిత హస్తులై సవినయంగా చెప్పడం మొదలెట్టారు.

"ఎందరో మహానుభావులు, అందరికీ వందనాలు. మా ఆహ్వానాన్ని మన్నించి సభకు విచ్చేసిన ఎందరో కవి పండితులకూ, నూతన రచయితలకూ ఇవే మా సమ స్సుమాంజలులు. మన మంతా ఇప్పు డిక్కడ ఎందుకు సమావేశ మయ్యామో మీ కందరికీ తెలుసు. ఇప్పుడు ఎంతో సభా కార్యక్రమం జరగాల్సిన కారణంగా సుదీర్ఘోపన్యాసాలతో సభికులకు విసుగెత్తించి, అసౌకర్యం కలిగించడం మా అభిమతం కాదు. అందుకే సూటిగా విషయాని కొస్తాను.

"శ్రీ రాయలవారి స్వహస్తాలతో జరిగే సువర్ణ గండపెండేర సత్కార పోటీ కోసం వేలాది నూతన రచయితలు ఎంతో ఉత్సాహంతో తమ తమ రచనలు పంపారు. వా రందరికీ శ్రీ రాయలవారి తరపున ఇవే మా కృతజ్ఞతలు. పోటీ కోసం మాకు చేరిన మొత్తం రచనల సంఖ్య మూడువేల ఏడువందల ఇరవైతొమ్మిది. మాకు చేరిన రచనలలో ఎంతో వైవిధ్యం ఉండటం మాకు సంతోషం కలిగిస్తున్నది. అయితే శ్రీ రాయలవారికి హఠాత్తుగా మరలా తగిలిన ఎన్నో రాచకార్య భారాల వల్లా, చేరిన రచనల్లో ఎక్కువభాగం ఒక్కొక్కటీ వేలాది పేజీలతో ఉండటం వల్లా, ఆ ఉద్గ్రంథాలన్నీ ఎన్నో గదులు ఆక్రమించడంవల్లా వాటి పరిమాణం చూసి ఆనందించడమే తప్ప ఇప్పటి వరకూ వాటిల్లో ఏ ఒక్కదానినీ చదవడానికీ, పరిశీలించడానికీ శ్రీ రాయలవారికి వ్యవధి దొరకలేదు, దొరకదు.

ఇందుకుగాను రచయితలు నిరాశ వడకుండా శ్రీ రాయలవారి బరువు బాధ్యతల్ని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాము.

"అయితే, ఈ నత్కార,పోటీని వాయిదా వేయడం కానీ, రద్దు చేయడం కానీ శ్రీ రాయల వారికి ఇష్టం లేదు. కాబట్టి, పోటీలో పాల్గొంటున్న ప్రతి కవీ, రచయితా తన కవిత్వం, లేదా రచన తాలూకు సారాంశాన్ని ప్రత్యేకతనూ, గొప్పదనాన్ని ఎవరికి వారే స్వయంగా ఈ నభాముఖంగా శ్రీ రాయలవారికి విన్నవించుకోడానికి నహకరిస్తే, వాటిలో ఉత్తమమైనది ఏదో వారు నిర్ణయించి, ప్రకటించిన ప్రకారం నత్కరిస్తారు. ఇందుకుగాను ఎవరికీ ఏ అభ్యంతరమూ ఉండబోదని ఆశిస్తూ, ఒకరి తరువాత ఒకరుగా తమ పాండితీ ప్రకర్షను ప్రకటించాల్సిందిగా కవి వండితులకూ, రచయితలకూ ఇదే మా విన్నపం."

నవ్వడి . కలకలం. కానీ కొన్ని నిముషాల్లోనే నమసిపోయిం దది. విషయం అర్థం కాక అయోమయంగా చూస్తున్న ఇతర భాషా రచయితలకు, విదేశీయులకూ, వారి మధ్య కూర్చున్న వలు భాషా కోవిదులైన అనువాదకులూ, మన తెలుగువారూ జరుగుతున్న కార్యక్రమాన్ని వారికి వివరిస్తున్నారు.

మొట్టమొదటగా ఎంతో పేరూ, ప్రఖ్యాతీ పొందిన, నభలో బానర్ కూడా కట్టించుకున్న ఒక ప్రముఖ రచయిత లేచి నిలబడి, హుందాగా ఇలా అన్నాడు : "న న్నందరూ 'ఈ శతాబ్దపు నూవర్ థ్రిల్లర్ రైటర్' అని పిలుస్తారు. 'సీడా-నిచ్చెనా', 'అంతరిక్షంలో అగ్నిగుండం', 'మంచం క్రింద కంచం', 'చీకట్లో చిన్నది', 'అద్దం అబద్ధం చెప్తుందా?', 'పిచ్చెక్కిన పిశాచం', 'పొద్దెరగని కొత్త పిచ్చోడు' ... ఇలా ఓ ఇరవై నవలలు రాశాను. ఒక ప్రత్యేకత ఏమంటే, నా కథల్లో హీరో హీరోయిన్స్ ఏ ప్రపంచంలోనైనా అందరికంటే చాలా చాలా తెలివైనవాళ్ళు. వాళ్ళ తెలివి వల్ల పాఠకులు ఎన్నో కొత్త విషయాలు కనిపెట్టి విజ్ఞానాభివృద్ధి చేసుకున్నారు, చేశారు, చేస్తారు. రెండోది - కథని మలుపులు తిప్పడంలో నా ప్రజ్ఞ వే రెవరికీ లేదు, రాదు. మూడోది - నా నవలలు అన్నీ సినిమాలుగా తీశారు, తీస్తారు. నే నెంత గొప్ప రచయితనో ఒక్క ముక్కలో చెప్పాలంటే, ఆఖరికి వందుం పుల్లల మీద కూడా సినిమా కథ రాయగలను. కాబట్టి ఈ నత్కారానికి నేనే అర్హుణ్ని!"

చప్పట్లు. జిందాబాద్‌లు.

మరో ప్రముఖ రచయిత [ఈయన కూడా బానర్ కట్టించుకున్నాడు] లేచి నిలబడ్డాడు. "జన్మభూమిలో జండా కర్ర', 'అదే అదే వదే వదే', 'నరసాని కో శవం', 'నా కొక్కటే అది నీకూ ఒక్కటే', 'వలవరించిన పీత', 'కమలమ్మ కడుపు' ... ఇలా సెక్సు, హాస్యం ప్రధానంగా నేనో నలభై నవలలు రాశాను ప్రభూ! ప్రతి పేజీకీ కనీనం రెండు జోకులైనా ఉంటాయి. నా అంత హాస్యంతో తెలుగులో రాసే వా ళ్ళెవరూ లేరు. అందుకే 'ఆంధ్రుల అద్వితీయ, అనమాన, అభిమాన రచయిత' అని నా కో బిరుదు కూడా ఇచ్చారు. నా నవలలు అన్నీ ఒక కుట్ర వల్ల ఇప్పటి వరకూ సినిమాగా తీయలే దనుకోండి, కానీ, ఇప్పుడున్న కథలన్నీ అయిపోయాక నావి తియ్యక ఛస్తారా? [చప్పట్లు]. అన్నట్టు మీ కో మంచి సెక్సు జోకు చెప్పనా? ఒక అమ్మాయి ..."

"వద్దు, వద్దు. ఆ జోకులన్నీ మేం ఇంగ్లీషు పుస్తకాల్లో ఎప్పుడో చదివేశాం. కూర్చో, కూర్చో!" అన్నా రెవరో నభికుల్లోంచి.

"నే నో భావకవిని సార్వభౌమా! 'కవి బ్రహ్మ' అని పిలుస్తారు నన్ను. 'రుధిరరక్తం' అనే నా కవితా నంకలనం ఒకటి నేనే నా డబ్బు పెట్టి, చాలా కష్టపడి అచ్చు వేయించాను. అందులో 'శ్మశాన నమాజం' అనే ఈ నా కవిత-

చల్లని వేడి, వెచ్చని చలిలో
కాలం గాలానికి ఎరనై ఎర్రటి
నా చర్మం నీ చొక్కాగా చిక్కి
గుండె మొండి గోడమీద మండిన
నిన్నటి పిచ్చి గాలి, రేపటి ఉప్పు స్నానం..."

ఆ కవి ఇంకా పూర్తి చేయకుండానే మరొకడు లేచాడు. "బొద్దింకల మీద తెలుగులో మొట్టమొదటిసారిగా మూ డొందల పేజీల నవల రాసింది నేనే ప్రభూ! కాబట్టి ఆ నత్కారం నాకే..."

"ఓం ప్రథమంగా తెలుగులో వంకాయల మీద నవల నేనే రాశాను మహారాజా! నా పేరు..."

"కాదు, కాదు. వంకాయల మీద తెలుగులో ఇదివరకే ఒక పుస్తకం వచ్చేసింది. దాన్ని సినిమాగా తీసినట్టు కూడా గుర్తు." కాస్త జ్ఞాపకశక్తి ఉన్న వా రెవరో లేచి అభ్యంతరం చెప్పారు.

"అబద్ధం ప్రభూ! వచ్చి అబద్ధం! ఇదివరకు వచ్చిన నవల తాజా వంకాయల మీద మాత్రమే. నేను రాసింది పుచ్చొంకాయల మీద. తెలుగులో పుచ్చొంకాయల మీద నాదే తొలి నవల. కాబట్టి ఆ..."

నవ్వాపుకుంటూ ఆలకిస్తున్నారు విదేశీయులంతా.

"నేను 'ఆంధ్రాస్ నూవర్ డూవర్ సెన్సేషన్ రైటర్'ని ప్రభూ! టీ.వీ. మెకానిక్స్ మీద తొలిసారిగా తెలుగులో రాసింది నేనే. కాబట్టి ఆ..."


"నా ముండ ముండమోస్తే? అని, వేశ్యల మీద వచ్చిన ఆ నవ కథా నంకలనం నాదే. ఇదివరకు ఎవరూ ఇంత చక్కటి సామాజిక స్పృహతో రాయలేదు. కాబట్టి, ఆ... నాకే..."

"నేను 'చేతబడి చెయ్యడం ఎలా?' అనే మహా ఉద్గ్రంథం ఒకటి చాలా వివరంగా రాశాను ప్రభూ! చేతబడి చేయించా లనుకునే మన తెలుగు వా రందరికీ ఎంతో మేలు చేశాను. ఎందుకంటే..."

"అయితే మనలో కూడా పిశాచా లున్నా యన్నమాట!" ఎవరో అరిచారు.

"రెం డర్థాల బూతు సినిమా పాటలు రాయడంలో నన్ను మించిన వాళ్ళు లేరు. అలాంటి పాటలు కొన్ని వందలు రాశాను. కాబట్టి, ఆ... నాకే..." ఒక కవి ఘోషించాడు.

"అరటి తొక్కలమీదా, వంది పెంటమీదా తెలుగులో తొలి నవలలు రాసింది నేనే ప్రభూ! ప్రతి ఒక్కరూ ఈ గొప్ప చెప్పుకోలేరు. కాబట్టి..."




"నేను 'జంతికల జీవితం', 'చేగోణీల చరిత్ర' అనే రెండు గొప్ప చారిత్రక గ్రంథాలు రాశాను మహారాజా..." నిలబడిం దో రచయిత్రి.

ఆ యా రచయితల రచనా విశేషాల్ని వింటూ వినోదిస్తున్న రాయలవారు అది విని, తొలిసారిగా కుతూహలాన్ని కనబరుస్తూ, "చేగోణీ లేవిటి? చరి త్రేవిటి?" అన్నారు ఆశ్చర్యంగా.

"శ్రీశ్రీ మహాకవి అని దేవర వారి దివ్య చిత్తానికి తెలిసే ఉంటుంది." ఆ రచయిత్రి అంది.

"అయితే ఏవిటి? శ్రీశ్రీ గారికీ, చేగోణీలకి ఏవిటి నంబంధం?" సార్వభౌములు ఇంకా ఆశ్చర్యపోయారు.

"అగ్గిపుల్లా, కుక్కపిల్లా, నబ్బుబిళ్ళా - కా దేదీ కవిత కనర్హం అన్నారు ప్రభూ ఆయన. అలాగే, 'చేగోణీలు కావు చరిత్ర కనర్హం' అని నా ఉద్దేశ్యం. 'చేగోణీల చరిత్ర' అనే నా గ్రంథం కథా, కమామీషూ ఏమంటే..."

"నోరు మూస్తావా, లేదా?" ఆవిడ్ని పూర్తి చేయనీయకుండా, ఆవిడను అక్కడి కక్కడే తన్నేంత కోపంతో లేచి గయ్యి మన్నాడు శ్రీశ్రీ. "దానికీ, దీనికీ సావత్యమా? వెధవ చేగోణీలూ నువ్వూనూ!"

"శ్రీశ్రీ ఇప్పటికీ ఉష్ణరక్త కాసారమే! ఆడపిల్ల, కోప్పడకు, కూర్చో శ్రీశ్రీ" అంటూ శ్రీశ్రీని కూర్చోబెట్టాడు పక్కనే కూర్చున్న చలం.

అతిథులంతా విరగబడి నవ్వుతున్నారు.

మరో రచయిత లేచాడు. " 'ప్రమాదంలో ప్రమోదం' అనే గొప్ప నవల రాశాను. నూవర్ సోనిక్ విమానం ఆకాశంలో వదిహేను వేల అడుగుల ఎత్తున పసిఫిక్ మహాసముద్రం మీంచి దూసుకుపోతూంది. కానీ, ఒక భయంకరమైన విదేశీ కుట్రవల్ల మరో వది నిమిషాల్లో కూలి, నరిగ్గా కొల్లేరు చెరువులో వడిపోతుంది. అప్పుడు హీరో ఆ విమానంలోంచి పారాచూట్‌తో

దిగి, సరిగ్గా అయిదు నిమిషాల్లో మరో విమానం ఎక్కడా ఆగకుండానే దాంట్లో ఎక్కి…"


"అదొట్టి చెత్త పుస్తకం" అన్నా రెవరో.

"ఆ దేవిటి, దాని ఇంగ్లీషు ఒరిజినల్ ఎంతో బావుందని మీ రందరూ…" నాలిక కరచుకుని చతికిలపడ్డా డతను.

"అప్పడాలతో అలంకారం" అని, అందరికీ ఉపయోగకరమైన చక్కటి వ్యాసా లెన్నో రాశాను మహా ప్రభూ నేను! కాల్చిన, లేదా నూనెతో వేపిన అప్పడాలు ఏ కారణం వల్లైనా మెత్తబడిపోతే తినడానికి పనికిరావని వాటిని వృథా చెయ్యకుండా, వాటి వెనకాల తెల్లకాగితం ఒకటి అంటించి, అంచులు గుండ్రంగా కత్తిరించి, దానిమీద ఏదైనా బొమ్మ అంటించి, లేదా పెయింటింగ్ వేసి, దారం కట్టి, డ్రాయింగ్ రూమ్స్‌లోనూ, బెడ్ రూమ్స్‌లోనూ వేళ్ళాడదీస్తే చూడ్డానికి చాలా చక్కగా ఉంటాయి. ఎన్నేళ్ళైనా మన్నుతా యి. అలాగే, క్రితం రోజు రాత్రి వండిన అన్నం మిగిలిపోతే దాన్ని వృథా చేయకుండా దానితో అరిసెలు ఎలా చేయొచ్చో కూడా…"

"వమి టేసిన పిల్ల అనే పుస్తకం రాసింది నేనే ప్రభూ!"

"నే నో సినిమా ప్రకటనా పత్రిక్కి విలేకర్ని ప్రభూ! 'స్టార్స్ స్టార్', 'డైరెక్టర్స్ డైరెక్టర్' అని వాళ్ళకి గొప్ప గొప్ప బిరుదులు తగిలించిందీ, డాక్టర్ కాబోయి యాక్టర్ అయ్యాననీ, ఇంజనీర్ కాబోయి ఇందులో చేరాననీ, నాకు అవి ఇష్టమనీ, నేను అలాగనీ, ఇలాగనీ వాళ్ళంతా రాసినట్టు రాసేది నేనే. నిజం చెప్పాలంటే ఆ సినిమా వాళ్ళంతా నావల్లే పై కొచ్చారు. కాబట్టి… ఆ… నాకే…"




ఈ రకంగా కొన్ని గంటల పాటు వేలాది యువకవులూ, రచయితలూ, నవ నవలాకారులూ, వ్యాసకర్తలూ తమ తమ రచనా పాటవం గురించి ఎవరికి తోచిన రీతిన వారు విన్నవించుకున్నారు. కొన్ని వినేదమైతే దొరికింది కానీ, రాయలవారికి అంతగా తృప్తి మాత్రం కలగలేదు. వారిలో ఏ ఒక్కరికైనా గండపెండేరం తొడగడం వారికి చిన్నతనంగా తోచింది. కానీ, ప్రకటించిన ప్రకారం ఎవరో ఒకర్ని సత్కరించకపోతే తెలుగు రచయితల్లో ఏ ఒక్కరికీ పసలేదని అక్కడున్న విదేశీయు లందరికీ కుండ బద్దలు కొట్టినట్టు తెలిసిపోయి, అది మరీ చిన్నతనంగా ఉంటుంది. రాయలవారు కూడా స్వయంగా తెలుగు అంటే అభిమానం కలవారు కదా మరి!

అందుకే అప్పాజీ వైపు ఓసారి ప్రశ్నార్థకంగా చూశారు. వారి సందిగ్ధాన్ని అర్థం చేసుకున్న అప్పాజీ ఏదో యోచిస్తూ - "ఇంకా ఏ రచయితైనా మిగిలిపోయారా?" అని సభికుల్ని ప్రశ్నించాడు.

కొన్ని నిమిషాల నిశ్శబ్దం తరువాత సభ ఓ చివర్నించి - "ఇదుగో, ఇక్కడ ఒకత నున్నాడు" అంటూ ఒక వ్యక్తి ఓ యువకుడిని ముందుకి నెట్టాడు.

"లేదు, లేదు. నే నిప్పటివరకూ ఏ రచనా చెయ్యలేదు. పోటీకి కూడా ఏవీ పంపలేదు." కొంచెం ఆందోళనగా అన్నా డా యువకుడు.

"అబద్ధం! ఇతను రాసింది నేను చదివాను ప్రభూ!" అన్నా డా వ్యక్తి బిగ్గరగా. "నా పక్కనే కూర్చుని, ఇప్పటి కిప్పుడే రాశాడు."

"ఏవో కొన్ని వాక్యాలు… అంతే! … అంతేకానీ…" అతను తల వంచుకుని మళ్ళీ గొణిగాడు.

"పరవాలేదు" అప్పాజీ ప్రోత్సహించాడు. "ఏదైనా పరవాలేదు. ఇందరు రచయితలు వాళ్ళ రచనల గురించి చెప్పలేదూ?"

"వా రందరి ముందూ నే నెంత మహారాజా?"

అప్పాజీ రాయలవారిని సమీపించి, వారి చెవిలో ఇలా ఊదాడు - "తమకి తీరిక లేకపోయినా, వర్తమాన సాహిత్య వివరాలన్నీ ఎప్పటికప్పుడు నా చెవిన పడుతూనే ఉన్నాయి ప్రభూ! ఇవేవీ తమకు నచ్చవని నాకు ముందే తెలుసు. అందుకే మన నరకలోకాధిపతి అయిన యమధర్మరాజుకి ఇదంతా ముందే విన్నవించి, వారి సహాయంతో మన త్రిలింగ దేశానికి చెందిన ఈ యువక రత్నాన్ని ఏరి కోరి, ఓ రోడ్డు ప్రమాదం జరిపించి, ఈ రోజు ఉదయమే మన ఈ స్వర్గలోకానికి రప్పించాను. ఇత డిప్పటివరకూ ఏవీ రాయకపోయినా, చాలా చురుకైన వాడనీ, తలచుకుంటే తమని మెప్పించగలడనీ తెలిసే భూలోక జీవితం నుంచి విముక్తి కలిగించి తెప్పించాను."

ఇంతలో, ఆ యువకుడి చుట్టుపక్కలే ఉన్న మరి కొందరు మరీ బలవంత పెట్టడంతో ఇక తప్పక, ఆ యువకుడు గొంతు సవరించుకుని ఇలా అన్నాడు.

"ఒక అతి చిన్న రచన మహారాజా! 'అబ్రకదాబ్ర' దీని పేరు."

'ఇదేవిటి, అప్పాజీ ఇలాంటి వాడ్ని భూమ్మించి తెప్పించాడా' అన్నట్టు చూస్తూ, రాయలవారు అడిగారు. "ఇదేమి పేరు? ఇది ఏ భాష? ప్రాకృతమా? దేవనాగరా? సంస్కృతమా?"

"అర్థం ప్రభూ! వినండి, ఇదీ నా ఈ చిన్ని రచన - ఇది తర్కం తెచ్చిపెట్టిన తరుగూ, తిరుగేలేని నా తీవ్రతత్వమే కావచ్చు. కానీ, నేను తలచుకుంటే తలపు తరుణీమణులు తమకంతో తాళలేక తహ తహ లాడుతూ, తన్మయత్వంతో తూలుతూ, తిమిరంలో తారుణ్యపు తెరలు తొలగించుకుని, నాకు తమ తను విచ్చి, తనివితీరా తృప్తి తీర్చుకుని తరిస్తారు. నేను తలచుకుంటే ఆలోచనల ఆడవాళ్ళు నన్ను ఆత్రంగా ఆలింగనం చేసుకుంటూ, ఆనందంతో, ఆహ్లాదంతో ఆత్మార్పణ చేసుకుంటారు. నేను తలచుకుంటే అక్షరాల అతివలు అదేపనిగా అలంకరించుకుని, నాకు తమ అద్భుతమైన అందాల్ని అణకువతో అనుంకల్పంగా, అవిరామంగా అందించి అజరామరమై అలరారుతా రు. నేను తలచుకుంటే పదాల పడతులు పదనిసలై నా ప్రణయ పరిష్వంగ పారవశ్యం కోసం పదే పదే పలవరిస్తూ పసందైన పడుచు పరువాలు చూపి, ప్రవాహంలా పొంగి పరవళ్ళు తొక్కి పరుగుతీసి నాకు ప్రణమిల్లి పాదదాస్యం చేస్తారు.

"నేను తలచుకుంటే వాక్య వనితలు విశృంఖల వ్యామోహ వాంఛతో వింత వన్నె చిన్నెల వెల్లువలై వలపు వంపు సొంపుల్ని వయ్యారంగా ఒలకబోస్తూ - "వద్దు, వద్దన్నా" వివేకపు వెలుగుతో ఒద్దికగా వచ్చి, వరసగా నా ఒడిలో వాలి వివశత్వంతో వశమైపోతా రు. నేను తలచుకుంటే 'శైలి' నాతో సరస సంకల్పంతో సుర సేవించిన సిద్ధ హస్తురాలైన సాని స్త్రీలా సైగలు చేస్తూ, సొకులు పోతూ నా సరసన చేరి, సుందరమూ, సుకుమారమూ అయిన తన సొయగాలన్నీ ఇచ్చి, సడీ, సుడీ, సుడీ తిరిగిపోతూ సత్తాతో సరిగమల సయ్యాటలాడి ఆడి శోషతో సొలిపోయి చివరికి శాంతితో శోభిస్తుంది సుస్థిరంగా, శాశ్వతంగా.

"నేను తలచుకుంటే కవితా కాంత కమనీయమైన నా కమ్మటి కౌగిలి కోసం కలలు కంటూ, కాంక్షతో కలవరిస్తూ, కసిగా కవ్విస్తూ, కోరి చేరి కైవసమై నా కనుసన్నల కెంపుల కాంతికోసం కటకటలాడుతూ కదులాడుతుంది. నేను తలచుకుంటే రచనా రమణి రమ్యమూ, రమణీయమూ అయిన రంగులన్నీ రంగరించుకుని నాతో రాసక్రీడ వాడి ఆడి, రసిక రసరాగ రాజసంతో రంజిల్లి, రత్నమై రాణిస్తుంది.


"నేను తలచుకుంటే సాహితీ సుదతి సహజ స్వభావసిద్ధమైన సందేహాన్ని సంకోచాన్ని సమసేలా చేసి, స్వాప్నికత్వంలోంచి స్వయంగా సాగివచ్చి, సింగారించుకుని, సద్దు చేయకుండా సమీపించి, సంగమ సుఖంకోసం సిగ్గొదిలి నా సందిట చేరి, సర్వస్వం సమర్పించి నాకే స్వంతమై సంతృప్తితో సంబరపడుతుంది. కానీ, నేను తలచుకోనుగాక కోను. ఇంతే ప్రభూ! నేను రాసింది."

రాయలవారి కళ్ళు తృప్తితో మెరవసాగాయి.

సభంతా నిశ్శబ్దం.

"శభాష్!" అన్నారు వారు చివరికి మందహాసం చిందిస్తూ.

కొన్ని చప్పట్లు.




నభికుల్లోంచి ఒక రచయిత లేచి అభ్యంతరం చెప్పాడు. "రచన చక్కగా ఉన్న మాట వాస్తవమే. కానీ, న్యాయంగా ప్రభువుల వారే కృతి భర్త కావాలి కదా? కానీ, ఇందులో కృతికర్తా, భర్తా కూడా అతడే. ఇది అసహజమూ, అనైతికమూ కాదా? పైగా ఇది కావాలని ప్రభువుల్ని అవమానించడం కాదా?"

"నిజమే!" సార్వభౌముల కనుబొమలు ముడివడ్డాయి. వారు కొన్ని క్షణాలసేపు మిన్నకుండిపోయారు.

ఇంతలో, ధైర్యాన్ని కూడదీసుకుంటూ ఆ యువకుడు ఏకంగా ఒక శతఘ్ని పేల్చాడు. "భర్త అంటే చెప్తున్నాను, ఇంతెందుకు మహారాజా? నేను తలచుకుంటే చాలు, [తెలుగు] భాషే ఓ భారతీయ భార్యలా బాస చేసి, బాంధవ్యంతో బందీ అయి, భావోద్రేకంతో బ్రతుకంతా నాకు బానిసై భోగభాగ్యాలతో భాసిస్తుంది. కానీ నేను తలచుకోనుగాక కోను!"

పెద్దన, కాళిదాసు, శ్రీనాథుడు, శ్రీశ్రీ, చలం వగైరా పూజ్యులైన తెలుగు వారంతా - "శభాష్! శభాష్!" అంటున్నారు చేతులు చరుస్తూ. "ఏమి ప్రాస!"

రాయలవారి వదనం మీద చిరునవ్వు తిరిగి ప్రత్యక్షమై అది అంతకంతకూ విశాలం కాసాగింది. వారి మొఖం సంతోషంతో, తృప్తితో వెలిగిపోతోంది.

"మహాకవికి నా మనస్సుమాంజలులు" అన్నారు సింహాసనం మీంచి లేచి నిలబడి చేతులు జోడిస్తూ. "అప్పాజీ!"

"ఇది అన్యాయం! మాకు అవమానం! ఇన్ని పుస్తకాలు, గ్రంథాలు రాసిన మమ్మల్ని కాదని, ఏవో రెండు వాక్యాలు గిలికిన వాడికి..." కొందరు రచయితలు ఆక్రోశిస్తూ అభ్యంతరం చెప్పారు. "ఏం గొప్పదనం ఉంది దాంట్లో?"

అదే చిరునవ్వుతో అప్పాజీ వైపు సాభిప్రాయంగా చూశారు సార్వభౌములు.

వారి అంతర్యాన్ని ఆసాంతం ఆకళించుకున్న అప్పాజీ తిరిగి ముకుళిత హస్తుడై, చిరునవ్వుతో సభికుల్ని ఉద్దేశించి ఇలా అన్నాడు - "నిర్ణయం జరిగిపోయింది. కానీ, ఏ కారణాల వల్ల శ్రీ రాయలవారు తమ స్వహస్తాలతో జరవబోయే ఈ సత్కారానికి ఈ యువకుడిని ఎన్నుకున్నారనేది మీకు వివరించాల్సి ఉంది. అందరూ శ్రద్ధగా వినాల్సిందిగా మా ప్రార్థన. అసలు..."

"అప్పాజీ!" రాయలవారు తిమ్మరుసును వారించారు. "నన్ను చెప్పనివ్వండి."

అప్పాజీ సవినయంగా కాస్త పక్కకి తొలగిపోయాడు.

సార్వభౌములు చెప్పడం మొదలెట్టారు - "ప్రబంధ కాలంలో కావ్యాన్నీ కవిత్వాన్నీ కోమలమైన కన్యతో పోల్చి 'నవ పల్లవ కోమల కావ్య కన్యకున్' అన్నారు ఒక కవివరేణ్యుడు. మరొక కవి సాహిత్యాన్ని సరస్వతితో - తల్లి భారతితో - పోల్చారు. నూతనంగా మరొక కవి అక్షరాల్ని అమ్మాయిలతో పోల్చి, - "నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన ఆడపిల్లలు" అన్నారు.

"కానీ, ఇప్పుడు మీ ముందు నిలబడిన ఈ యువకవి తెలుగు భాషలోనే తొలిసారిగా అద్భుతమైన ప్రాసతో సాహిత్య సమస్తాన్నంతా రకరకాల స్త్రీలతో పోల్చారు - తలపుని తరుణితో, ఆలోచనలని ఆడవారితో, అక్షరాల్ని అతివలతో, పదాన్ని పడతితో, వాక్యాన్ని వనితతో, సాహిత్యాన్ని సుదతితో పోల్చారు. ఒక వాక్యంలో వాడిన పదం మరలా వాడకుండా, అందునా అత్యంత సరళమైన పదాలతో రాసి, ప్రతి వాక్యాన్నీ అద్భుతమూ, ఇప్పటివరకూ అనితర సాధ్యమూ అయిన ప్రాసతో, ఇంకా, ఏమాత్రమూ అశ్లీలం కాని శృంగార రసాన్ని ప్రతి వాక్యంలోనూ పోషించారు.

"ఇం తెందుకు, వారి మాటల్లోనే చెప్పాలంటే, తలచుకున్నంత మాత్రాన భాషే భార్యలా బందీ అయి, బాంధవ్యంతో, భావోద్రేకంతో బానిసై భావితరాల్లో సైతం భోగభాగ్యాలతో భాసిస్తుందనీ, కానీ తన కా ఉద్దేశ్యం లేదని ఢంకామీద దెబ్బకొట్టి సభాముఖంగా సగర్వంగా ప్రకటించగలిగిన తొలి తెలుగు కవి వీరే! వీరు తలచుకుంటే ఏ వస్తువు మీదైనా సరే అత్యుత్తమ కవిత్వం చెప్పి ఉండే వారే. అత్యుత్తమ రచన చేసి ఉండేవారే.

"కానీ, భాషా సమస్తాన్నీ ఎందరో రచనా లలనామణుల్నీ లావణ్యవతుల్నీ తలచుకున్నంత మాత్రాన పొందగలిగి కూడా, కనుచూపుతో కైవసం చేసుకోగలిగి కూడా నిగ్రహించుకోగల ధీశాలి వీరు. అందుకే ఈ సత్కారానికి వీరే అర్హులు! ఇక కృతి భర్త విషయం నియమాల్లో ఎక్కడా చెప్పలేదు కాబట్టి దాని ప్రసక్తే లేదు!"

ఆనూయతోనూ, ఆహ్లాదంతోనూ నిండిన హర్షధ్వానాల మధ్య, సువర్ణ గండపెండేరం ఉంచిన బంగారు పళ్ళెరాన్ని చేతితో పట్టుకున్న అప్పాజీ వెన్నంటి రాగా, సింహాసనపు మెట్లు ఒక్కొక్కటిగా దిగుతూ ఆ యువకుడ్ని సమీపించారు రాయలవారు.

"మహాభాగ్యం మహారాజా!" అన్నాడా యువకుడు ఆనందంతో శిరసు వంచి.

** ** **

"మహాభాగ్యం మహారాజా!"

"ఎవర్రా ఆ మహారాజు? ఇంత పొద్దెక్కినా ఇంకా లేవ్వేం? రాత్రంతా మేలుకుని ఆ వెధవ పుస్తకాలన్నీ చదివి పలవరించొద్దని ఎన్నిసార్లు చెప్పా న్నీకు?" అమ్మ విసుక్కుంటోంది.

"కాస్సేపట్లో అక్కడున్న పెద్ద పెద్ద రచయిత లందరితోనూ షేక్‌హాండ్ తీసుకుందా మనుకుంటూంటే లేపేశావు. అయినా, నీకు తెలీదులేవే అమ్మా! ఇప్పుడు నిజంగా రాయలవారే ఉంటేనా, అక్షర లక్షలు కాకున్నా అగ్రహారాలైనా ఇచ్చేవారు. అర్థ నూటపదహార్లు కాదు కదా, పత్రికల వాళ్ళు పట్టుమని పది రూపాయలు కూడా ఇవ్వరు. కళాపోషకు లిప్పుడు వాళ్ళేనాయె, అయినా కూడా ఇవ్వరు!" అన్నాను కాలికి ఆ దింకా ఏమైనా ఉందేమో నన్నే భ్రమతో దుప్పటి ముసుగుతీసి తొంగిచూసి ఆవలిస్తూ. ★

